WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramteluguddaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ సంపుటి : 9 సంచిక : 211 గురువారం, జూలై 30, 2026 , పేజీలు - 4 వెల: 5/-

### కాళేశ్వరం నుంచి నీటి చుక్క వాడకుండా

## అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ



**హైదరాబాద్, జులై 29** కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి చుక్క కూడా వాడకుండా భారతదేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన వారం రోజుల్లోనే లీక్ అయిందన్నారు. ఈ విషయం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి కూడా తెలుసునని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి సహా అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. సుమారు మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్ల వడ్డీ రూపంలో కడుతున్నామని వివరించారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ పార్టీ పిచ్చి రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కానీ ఆ ప్రాజెక్ట్‌తో తాము అలాంటి రాజకీయాలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బాధ్యత లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. ఇసుకలో కాళేశ్వరం ఫౌండేషన్ వేశారని గుర్తు చేశారు. ఐఐటీ బాంబే ఆఫ్రి కంపెనీతో సాయిల్ టెస్ట్ చేయించామని పేర్కొన్నారు. బ్యారేజీలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని.. అంటే అది ఓపెన్ చేస్తే ప్రజలకు ఏమైనా అయితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కక్కుర్తి, అసమర్థత వలన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. అయితే కాళేశ్వరం విషయంలో తమకు రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు.కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీ బూటకపు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని జబౌ=ూా రిపోర్ట్ ఇచ్చిందని గుర్తు చేశారు. చీణూూా మొదట ప్రిలిమినరీ రిపోర్ట్ నవంబర్ 23 ఇచ్చిందని ప్రాజెక్ట్ నిర్మించారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు రూ. 1400 కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లు చెక్ రూపంలో ఇచ్చారని కల్వకుంట కవిత చెప్పారని..అది వాస్తవమని పేర్కొన్నారు.తనకు రిమేఘా సంస్థకు ఇవ్వలేదన్నారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సీబీఐకి లేఖ రాశామని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 24 గంటల్లో సీబీఐ విచారణ జరిపిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ధాన్యం కుంభకోణం చేసిన వారిని అరెస్ట్ చేస్తామన్నారు. ూాదీజ టన్నులు తమ హయంలో పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

### తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు

## సుప్రీంకోర్టులో భారీ ఊరట



**హైదరాబాద్, జులై 29:** తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది.అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తైన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

### కాంగ్రెస్‌ను రాజకీయంగా ఇరుకున పెట్టాలని


## బీఆర్ఎస్ వ్యూహం



**హైదరాబాద్ :** తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్లపై పోరు సాగిస్తున్న బీఆర్ఎస్ ఎస్సీ సంగ్రామ సదస్సుకు సన్నాహాలు చేస్తోంది. రైతు, యువ సంగ్రామ సదస్సులు పూర్తైన నేప థ్యంలో చేవెళ్ల వేదికగా ఎస్సీలకు, నాడు హస్తం పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు సిద్ధమైంది. బీఆర్ఎస్‌లోని ఎస్సీ నేతలతో త్వరలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమై సదస్సు విషయంపై నిర్ణయం తీసుకోనున్నారు. డిక్లరేషన్లలో ఇచ్చిన హామీలపై : 2023 అసెంబ్లీ ఎన్ని కల సమయంలో కాంగ్రెస్ పార్టీ వివిధ వర్గాలకు ప్రకటించిన డిక్లరేషన్లనే బీఆర్?ఎస్? ఇప్పుడు రాజకీయ అస్త్రంగా మలుచుకుంటోం ది. ఎన్నికల ముందు రైతులు, యువత, మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు తదితర వర్గాలకు ప్రత్యేక డిక్లరేషన్ల రూపంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసే ందుకు ప్రధాన ప్రతిపక్షం కార్యాచరణను ముమ్మరం చేసింది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా డిక్లరేషన్లలోని కీలక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది.ప్రజలకు వివరించాలనే : కాంగ్రెస్ పార్టీ ఏ వేదికలపై ఆయా డిక్లరేషన్లను ప్రకటించిందో, అదే ప్రాంతాల్లో "సంగ్రామ సదస్సులు" నిర్వహించా లని గులాబీ అధినాయకత్వం నిర్ణయించింది. దీంతో కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఇరుకున పాటు ఆయా వర్గాల్లో మళ్లీ తమ పట్టు పెంచు కోవాలని బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది.

### తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర

**- 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ**




**హైదరాబాద్ :**రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ మేరకు పోలీస్‌శాఖలో సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, ఫైర్, జైళ్లశాఖలో పలు ఖాళీల భర్తీకి సంబంధించి 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. త్వరలో దరఖాస్తు తేదీలను ప్రకటిస్తామని పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపింది. వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని నియామక మండలి తెలిపింది.

## సర్' ప్రక్రియను వేగవంతం చేయాలి

- 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుంది.
- ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం.



**ఢిల్లీ, జులై 29 :** ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.'సర్'పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏ(లను నియమించినట్లు చెప్పారు. 50 నుంచి 60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు (బుధవారం) జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో 'సర్' ప్రక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## తూర్పు కనుమల్లో అరుదైన మొక్క ఆవిష్కరణ.



**తిరుపతి జిల్లా:**మన తూర్పు కనుమలు దట్టమైన అడవుల తోనే కాదు, ప్రపంచంలో ఎక్కడా లేని అరు దైన సహజ సంపదతో నిండి ఉన్నా యని మరోసారి నిరూపితమైంది. తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమలలో పరిశో ధకులు సరికొత్త రకానికి చెందిన అరుదైన మొక్కను కనుగొన్నారు.ఈ కొత్త వృక్ష జాతికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఒక ప్రత్యేకమైన పేరును ఖరారు చేశారు.యూఫోర్బి యేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త మొక్కకు "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్") అని పేరు పెట్టారు. తిరుపతి జిల్లాలోని ప్రసిద్ధ ఉబ్బలమడుగు జలపాతానికి సమీపంలో ఉన్న కంబకం కొండల ప్రాంతంలో మాత్రమే ఈ మొక్క సహజంగా పెరుగుతోంది. అందుకే ఆ ప్రాంత పర్యావరణ ప్రాముఖ్యతను గుర్తించి, దానికి గుర్తుగా 'ఉబ్బలమడుగెన్సిస్' అనే పేరును ఖరారు చేశారు.ఈ మొక్క ఆకులు తాకగానే మంత్రముగ్ధులను చేసే అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లుతాయి. దీని ప్రత్యేకతలు, సువాసన విశేషాలు పవన్ కళ్యాణ్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సహజ వారసత్వ సంపదను, ప్రకృతిని కాపాడుకోవడంలో రాష్ట్ర కూటమి ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు అద్దం పడుతోంది.

### బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను

## ముంచుతామంటారా



**హైదరాబాద్, జులై 29:** హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. (బుధవారం) మీడియాతో మాట్లాడు తూ. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు.

### ఆగస్టు 3లోగా 100 శాతం

## డిజిటలైజేషన్ పూర్తి చేయాలి




**హైదరాబాద్, జులై 29:** ఓటరు జాబితా సవరణ కేవలం తప్పులు లేని ఓటర్ల జాబితా కోసమేనని తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎస్ఐఆర్ (ూ×=) పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆగస్ట్ 3వ తేదీలోగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 76 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. 8 నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు.

జీహెచ్ఎంసీతోపాటు రంగారెడ్డి, మేడ్చల్ తదితర పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. డిజిటలైజేషన్‌లో నిర్లక్ష్యం వహిస్తే బీఎల్ఓలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకే కుటుంబ సభ్యుల ఓట్లన్నీ.. ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల సమావేశాలను వీడియో తీయాలని జిల్లా కలెక్టర్లను సీఈఓ ఆదేశించారు. వీఐపీ, వీవీఐపీ ఓటర్ల మ్యాపింగ్ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎస్ఐఆర్‌కు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ఆయన పునరుద్ఘాటించారు.

# 62 లక్షలతో నూతన కల్వర్ట్ నిర్మాణ పనులు

**- పరిశీలించిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**







**కుత్బుల్లాపూర్, నవతరం:** 126 – జగద్గిరిగుట్ట డివిజన్ పైప్ లైన్ రోడ్డులోని 62.00 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అభివృద్ధికి వారధులు, ప్రధాన రహదారులని అన్నారు. గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా ప్రజల సౌకర్యార్థం మరిన్ని రహదారులను మెరుగు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సంధ్య, ఏఈ లు ఆశా, అభిరామ్, మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవీందర్, కిషోర్, నాయకులు బాబు గౌడ్, బస్వరాజ్, మెట్ల శ్రీను, బ్రహ్మానంద చారి, తదితరులు పాల్గొన్నారు.

# రూ. మూడున్నర కోట్లపైనే విలువ గల ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు





**హైదరాబాద్, నవతరం:** చిల్పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 229లో 36 ఎకరాల పైన సీలింగ్ భూములు (ప్రభుత్వ భూములు) ఉన్నాయి. గత రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల మూడు ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమిని భూమి కన్స్ట్రక్షన్స్ (తీఘుఎఎ ఎఱఙ జూశ్రీఖత్) వారు 2019 నుంచి ఈ ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని ప్లాంట్ ను నిర్వహిస్తున్నారు. ఈ భూమి ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్న తర్వాత ప్రస్తుత జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు, ఈ భూమిని ఈ నెల 20వ తేదీన ప్రభుత్వానికి స్వాధీనం చేసుకోమని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భూమి తరిగొప్పుల, చిన్న పెండ్యాల ప్రధాన రహదారిపై ఉన్నందున మార్కెట్ విలువ రూ. మూడున్నర కోట్లపైనే ఉంది. ఈ విషయంపై చిల్పూర్ మండల ప్రజలందరూ కూడా హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా అక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# ఆగస్టు 10న పటాన్‌చెరు పట్టణంలో బోనాల మహోత్సవం

**బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్**







**పటాన్చెరు, నవతరం:** ఆషాఢ మాసం సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలో ఆగస్టు 10 (సోమవారం) బోనాల మహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించాలని పట్టణ ప్రముఖుల సమావేశంలో నిర్ణయించినట్లు బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ తెలిపారు. బోనాల మహోత్సవ ఏర్పాట్లపై పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో, స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ అధ్యక్షతన పట్టణ ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బోనాల మహోత్సవ నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పటాన్‌చెరు బోనాల మహోత్సవం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆగస్టు 10న నిర్వహించనున్న బోనాల మహోత్సవాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, పురోహితులు, భక్తులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు, ఎంపీఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# గురువే దైవం.. ఆధ్యాత్మిక చింతనతో పలాసలో గురు పౌర్ణమి వేడుకలు

**- పలాస కాశీబుగ్గ రామాలయంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు**
**- గురు-శిష్యుల అనుబంధం పవిత్రమైనది: బల్ల గిరిబాబు**
**- వ్యాసుడి జ్ఞానజ్యోతి నేటికీ ఆదర్శం: బల్ల గిరిబాబు**



**పలాస డేట్ లైన్: జూలై 29** గురువును పూజించే పవిత్ర పర్వదినం గురు పౌర్ణమి. ఆషాఢ శుద్ధ పూర్ణిమ నాడు వ్యాస మహర్షి జన్మించిన రోజును గురు పూజోత్సవంగా, వ్యాస జయంతిగా జరుపుకుంటారు. జ్ఞాన జ్యోతిని వెలిగించి, జీవితానికి దిశానిర్దేశం చేసే గురువు స్థానం దైవంతో సమానమని శాస్త్రాలు చెబుతున్నాయి. గురువు లేనిదే జీవితం అంధకారమేనని, ఆయన చూపే బాటలో నడిస్తేనే జీవితం సార్థకమవుతుందని పండితులు పేర్కొంటారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని పలాస కాశీబుగ్గ పట్టణం భక్తి శోభతో వెలిగిపోయింది. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు స్థానిక రామాలయం వద్ద వెలసిన లిషిరిడి సాయిబాబాలిను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయినాథునికి పూలమాలలు అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురు పౌర్ణమి, వ్యాస జయంతి విశిష్టతను వివరించారు. "గురువు అంటే అజ్ఞాన చీకట్లను పారద్రోలి వెలుగు చూపే వ్యక్తి. గురువు, శిష్యుల మధ్య ఉండే అనుబంధం అత్యంత పవిత్రమైనది. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానందల గురు–శిష్య అనుబంధం ఈ తరానికి ఆదర్శం. గురువు చూపిన బాటలో శిష్యుడు నడిస్తే జీవితంలో ఎలాంటి కష్టమైనా సులభంగా దాటవచ్చు. గురువు ఆశీస్సులు ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. వ్యాస మహర్షి వేదాలను నాలుగు భాగాలుగా విభజించి, 18 పురాణాలు, మహాభారతం రచించి మానవాళికి అమూల్యమైన జ్ఞానాన్ని అందించారు. 'గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు దేవో మహేశ్వరః' అనే శ్లోకం గురువు యొక్క స్థానాన్ని తెలియజేస్తుంది. అందుకే ఈ రోజును వ్యాస పూర్ణిమగా జరుపుకుంటాము. సాయినాథుని 'శ్రద్ధ, సబూరి' సందేశం ఈనాటి సమాజానికి ఆదర్శం. మానవ సేవే మాధవ సేవ అని బాబా బోధించారు. సాయినాథుని ఆశీస్సులతో పలాస కాశీబుగ్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రతి ఇంటా శాంతి, సుభిక్షం నెలకొనాలని ప్రార్థించాను" అని తెలిపారు. ఆలయంలో వేద పండితులు సాయినాథునికి వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయినాథుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం మొత్తం రంగురంగుల పూలతో, మామిడి తోరణాలతో అందంగా అలంకరించబడింది. భజనలు, స్తోత్రాలతో ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో వల్లభ వైకుంఠరావు, ఎండి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు

# జగద్గిరిగుట్టలో పాము కలకలం

**- ఖాళీ స్థలంలో చెత్త పేరుకుపోవడమే కారణం...?**



**జగద్గిరిగుట్ట, నవతరం:** పొలాల బస్తి, రోడ్ నంబర్ 7 లో మంగళవారం పాము కలకలం సృష్టించింది. ఓ స్థానిక నివాసి ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారం పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో, అక్కడ పెద్ద ఎత్తున ఎలుకలు, పాములు సంచరిస్తున్నాయని స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... తన ఇంటికి ఆనుకుని ఉన్న ఖాళీ ప్లాట్‌లో గల చెత్తాచెదారం వల్ల నిత్యం ప్రమాదకరమైన పాములు ఇంటి పరిసరాల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఒక పెద్ద పాము సంచరించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ విషయంపై సదరు ఖాళీ స్థలం యజమానికి ఎన్నిసార్లు విన్నవించినా, చెత్తను తొలగించి స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచమని వేడుకున్నా అతను పెడచెవిన పెడుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. యజమాని నిర్లక్ష్యం వల్ల తమ ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత సీఎంసీ అధికారులు స్పందించి, సదరు స్థల యజమానికి నోటీసులు జారీ చేసి, ఖాళీ ప్లాట్‌లోని చెత్తను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని బస్తి వాసులు కోరుతున్నారు.

# రహదారి ఆక్రమణల తొలగింపు









**కుత్బుల్లాపూర్, నవతరం:** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ పరిధిలోని షాపూర్ నగర్ నుండి సూరారం వరకు ఉన్న రహదారి ఆక్రమణలను అధికారులు తొలగించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ట్రాఫిక్ సులువుగా సాగడమే లక్ష్యంగా పోలీస్ శాఖ సమన్వయంతో ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. సర్కిల్ పరిధిలో అక్రమ కట్టడాలు కట్టినచో అట్టి అక్రమ కట్టడాలుపై కఠిన చర్యలు తీసుకోబడునని గాజులరామారం ఉప కమిషనర్ యు. వెంకట్ రాములు హెచ్చరించారు . ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి. సరిత సేన్ తమ సిబ్బందితో కలిసి పాల్గొని పర్యవేక్షించారు. రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.ం

# అమృత రెడ్డి కి శుభాకాంక్షలు

**- నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలికి షాలువాతో సన్మానించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**





**కుత్బుల్లాపూర్, నవతరం:** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ను సూరారం డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీ నూతన అధ్యక్షురాలుగా ఎన్నికైన అమృత రెడ్డి, వారి కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం మరియు భవిష్యత్ కార్యాచరణపై వారు మాజీ ఎమ్మెల్యేతో చర్చించారు. నూతన బాధ్యతలు చేపట్టిన అధ్యక్షురాలు అమృత రెడ్డి కి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శుభాకాంక్షలు తెలియజేసి, కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకర్ రావు జనరల్ సెక్రటరీ, ఇంద్రసేన గుప్తా, వెంకటప్ప రెడ్డి, సాయిరాం రాఘవ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, సాంబశివరావు, కాంగ్రెస్ నాయకులు చౌడా శ్రీనివాసరావు, నాగిళ్ల శ్రీనివాస్, ఉలిపి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి





**హైదరాబాద్, నవతరం:** విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడడాన్ని నిరసిస్తూ, బీజేపీ యువ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ పిలుపు మేరకు చేపట్టిన "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శ్రీనాథ్ పిలుపుమేరకు బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 450 మంది విద్యార్థిని విద్యార్థినుల సంతకాల సేకరణ చేసి నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రాం కన్వీనర్ కో కన్వీనర్లు మరియు మండల అధ్యక్షులు మరియు వివిధ మండల బీజేవైఎం అధ్యక్షులు, బీజేవై ఎం కార్యకర్తలు పాల్గొన్నారు. మాట్లాడుతూ తెలంగాణలో సుమారు దాదాపుగా 40 లక్షల మంది విద్యార్థుల స్కాలర్షిప్లు 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ యువ మోర్చా పోరాటం నిరంతరం కొనసాగుతుంది. రానున్న రోజుల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఉద్యమం నిర్వహిస్తాం అని హెచ్చరించారు.విద్యార్థుల పక్షాన... బీజేపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం వివిధ మోర్చాల రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నగర మరియు మండల బాధ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురువుల మహిమను చాటిన గురుపౌర్ణమి వేడుకలు.

**- గురుభక్తితో నిండిన శ్రీ సత్యనారాయణ గీతా మందిరం.**



**దౌల్తాబాద్, జూలై 29(**
గురుపౌర్ణమి సందర్భంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ గీతా మందిరంలో బుధవారం గురుపూజా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, ప్రత్యేక పూజలు, గురుపూజ, వేద మంత్రోచ్చారణల నడుమ ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా సాగాయి.ఈ సందర్భంగా నిర్వహించిన భక్తులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానమార్గంలో నడిపించే మహనీయులు గురువులని పేర్కొన్నారు. గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి ధర్మమని, గురుపౌర్ణమి వంటి పర్వదినాల ఆచరణ ద్వారా ఆధ్యాత్మిక విలువలు, సంస్కారాలు మరింత బలోపేతమవుతాయని వివరించారు.అనంతరం భక్తులు గురువులకు పాదపూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమం ముగింపులో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# ఏడుపాయల దుర్గాభవానిని దర్శించుకున్న పూసల సంఘం నాయకులు.

**- వనదుర్గా భవాని సన్నిధిలో ప్రత్యేక పూజలు.**



**దౌల్తాబాద్ జూలై 29**
కరీంనగర్ నియోజకవర్గ పూసల సంఘం నాయకులు ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొంది సమాజం సుఖశాంతులు, అభివృద్ధితో వర్ధిల్లాలని ప్రార్థించారు.
ఈ సందర్భంగా కరీంనగర్ నియోజకవర్గ పూసల సంఘం గౌరవ అధ్యక్షుడు కోనేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఖమ్మం శ్రీనివాస్, కోశాధికారి కోనేటి శివ, వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి శ్రీనివాస్‌తో పాటు సంఘం సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

**- బంగారం వెండి నగదు అపహరణ**

**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/జూన్29(**
గంభీరావుపేట మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు.ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది కుటుంబ సభ్య లు తెలిపిన ప్రకారం ఇంట్లో నుంచి సుమారు8తులాల బంగారం15 తులాల వెండి30 వేలు నగదు దుండగులు అపహరించరూ.రెండు రోజుల క్రితం ఇంటి యజమాని పత్తి స్వామి తన మామ ఆనారోగ్యంతో. కరీంనగర్ లోని ఓ ఆసుపత్రికి కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి వేల్లగా ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు.ఇంటి పక్కన నివసించే బెజవాడ శ్రీదేవి. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని గమనించి.యజమానికి సమాచారం అందించింది దీంతో పత్తి స్వామి ఇంటికి చేరుకొని పరిశీలించగా.ఇంటి తాళం పగలగొట్టి.ఇంట్లోని రెండు బీరువాల్లో భద్రపరిచిన బంగారం.వెండి.నగదు. గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసి పరాలైనట్లు పోలీసులకు సమాచారం అందిగా.డి.ఎస్.పి నాగేంద్ర చారి.సిఐ వెంకటేష్.ఎస్పై శ్రీకాంత్.ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు

# వైఎస్ జగన్ శ్రీకాకుళం పర్యటన వైఎస్సార్సీపీ శ్రేణులు విజయవంతం చేయాలి

**- రాజకీయ కక్షసాధింపుతో అక్రమ కేసులు... ప్రజాస్వామ్యంపై దాడి: వైసీపీ నేతలు ఖండన**
**- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, కుమారుడి అరెస్టు చట్టాన్ని అధికార పార్టీకి ఆయుధంగా మార్చడమే**
**- చట్టం రాజ్యాంగం ప్రకారం నడవాలి... అధికార పార్టీ సంకేతాలతో కాదు: డొక్కరి దానయ్య యాదవ్**





**మందస డేట్ లైన్: జూలై 29**
ప్రతిపక్ష గొంతును అణచివేసేందుకు చట్టాన్ని రాజకీయ ఆయుధంగా వాడుతున్నారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో పడ్డాయని వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రిపై కేసులు నమోదు చేయడం వెనుక అధికార పార్టీ కుట్ర ఉందని మండిపడ్డారు.మందస మండలం నారాయణపురం గ్రామంలో మంగళవారం ఉద్దానం క్లస్టర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. పలాస నియోజకవర్గంలో నమోదైన కేసుల వ్యవహారంపై సమావేశంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ నాయకులు ఖండన తెలిపారు.సమావేశంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్ మాట్లాడుతూ, "పలాసకు చెందిన శ్రీ దుబ్బ దానయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత విషాదకరం. ఆయన కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి. ప్రమాదానికి బాధ్యులెవరైనా ఉంటే చట్టప్రకారం నిష్పాక్షికంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. దానిపై మాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని అన్నారు.రహదారి ప్రమాదాన్ని మర్డర్ కేసుగా చిత్రీకరించి అక్రమంగా రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులిను అరెస్ట్ చేసి జైలులో పెట్టిన నేపథ్యంలో వైఎస్సార్సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి లివైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం శ్రీకాకుళం సమీపంలో గల అంపోలు వద్ద నున్న జైలులో మూలాఖత్ డాక్టర్ అప్పలరాజుతో కానున్నారని, ఈ సందర్భంగా మందస మండలంలోని వైఎస్సార్సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చి రాష్ట్ర మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు నివాసం వద్ద చేరుకోవాలని డొక్కరి దానయ్య పార్టీ శ్రేణులకు కోరారు.అయితే, సాధారణ రోడ్డు ప్రమాదంగా కనిపించే ఘటనను రాజకీయ కక్షసాధింపుతో హత్య కేసుగా చిత్రీకరించి మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఆయన కుమారుడు లిఆరవ్ వర్మలితో పాటు లిసిద్ధార్థలిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు, న్యాయసూత్రాలకు విరుద్ధమని మండిపడ్డారు."రాష్ట్రంలో ప్రతిరోజూ అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి ప్రమాదాన్ని ఇదే విధంగా హత్య కేసుగా నమోదు చేస్తున్నారా? ఒకే చట్టం అందరికీ సమానంగా అమలు కావాలి. రాజకీయ అనుబంధాలను బట్టి కేసుల స్వరూపం మారుతుందనే భావన ప్రజల్లో కలిగితే అది న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది" అని ఆయన అన్నారు."చట్టం రాజ్యాంగం ప్రకారం నడవాలి. అధికార పార్టీ సంకేతాలతో కాదు. పోలీసులు చట్టానికి జవాబుదారులు కావాలి, రాజకీయ ఆదేశాలకు కాదు. దర్యాప్తు సంస్థలు అధికార పార్టీ ప్రతీకార రాజకీయాలకు సాధనంగా మారితే ప్రజాస్వామ్యానికి అది అత్యంత ప్రమాదకరం" అని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును రాజకీయంగా అణగదొక్కాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ముందుగా ఆయన కుమారుడు ఆరవ్ వర్మను రిమాండ్‌కు పంపి, అనంతరం అదే కేసులో డాక్టర్ సీదిరి అప్పలరాజును నిందితుడిగా చేర్చి అరెస్టు చేయడం రాజకీయ కక్షసాధింపుగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు."ప్రతిపక్ష నాయకులను కేసులతో భయపెట్టవచ్చేమో కానీ, ప్రజల గొంతును అణచివేయలేరు. అధికారం శాశ్వతం కాదు... కానీ చట్టంపై ప్రజల నమ్మకం శాశ్వతంగా నిలవాలి. రాజకీయ ప్రయోజనాల కోసం చట్టాలను వక్రీకరించే ప్రయత్నాలను వెంటనే విరమించి, ఈ కేసులో నిష్పాక్షికంగా వ్యవహరించాలి" అని ప్రభుత్వం, పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నేతలు జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, కె. ఆదినారాయణ మాస్టర్, డి జానకి రెడ్డి, దున్న హరికృష్ణ, మద్దిలి బాలకృష్ణ యాదవ్, బత్తిన లక్ష్మణ్, మజ్జి హేమరాజ్, బెలమర జీవన్, సొర్ర ఢిల్లీశ్వరావు, అందాల శేషగిరావు, తిరునగరి సవరయ్య మాస్టర్, బత్తిన వెంకట్, సేనాపతి కిషోర్, సేనాపతి దివ్య, బల్ల లీలా కుమారి, బత్తిన తేజ, మార్పు వెంకటరమణ(కృష్ణ) పాల్గొన్నారు.

# మల్కంచెరువు, సిటీ వైన్స్ వాటర్‌లాగింగ్ ప్రాంతాలు, సీఓడీ పైప్‌లైన్ పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్









**సైబరాబాద్, నవతరం:** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సూచించారు. ఈ సందర్భంగా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కంచెరువు వాటర్‌లాగింగ్ పాయింట్, సిటీ వైన్స్ వాటర్‌లాగింగ్ ప్రాంతాన్ని, అలాగే మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెంటర్ ఫర్ ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ పైప్‌లైన్ పనుల పురోగతిని సీపీ సంబంధిత సివిక్ బాడీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వాటర్‌లాగింగ్ సమస్యకు కారణమవుతున్న అంశాలను అధికారులు వివరించగా, వర్షపు నీరు వేగంగా వెళ్లేలా అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని సీపీ సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించడం, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం ద్వారా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే సీఓడీ పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనుల జరుగుతున్న ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు, అవసరమైన ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, తో పాటు సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), సన్ ప్రీత్ సింగ్, సీఎంసీ కమిషనర్ సృజన, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాధాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, సీఎం సి డిప్యూటీ కమిషనర్, ఏఈ/ఏఈఈ అధికారులు, హైడ్రా సిబ్బంది, ఇతర సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**:- పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**



**రామగుండం,జులై 29**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ వర్షాలతో నాలాల ప్రవహించే నీరు రోడ్డుపై రావడంతో ఆ ప్రాంతాలను పెద్దపల్లి డిసిపి బి. రామ్ రెడ్డి,మున్సిపల్ కమీషనర్,మేయర్ మహంకాళి స్వామి,గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్ గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తో మల్కాపూర్,మెడికల్ కళాశాల,5 ఇంక్లైన్,తదితర ప్రాంతలలో కలిసి వరదను పరిశీలించి జిల్లాలో భారీ వర్షాలతో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, అదేవిదంగా అధికారులకు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తుందున వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు,చెరువులు నదుల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉందని,వాటి వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు.గోదావరి, మానేరు నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,చెరువులు, వాగులు,ప్రాజెక్టుల వద్దకు ప్రజలు,యువత వెళ్లకూడదన్నారు.వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు,యువకులు చెరువులు నది దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి,ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలంచడానికి జిల్లా పోలీసు అధికారులు,సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా డయల్ 100 కి లేదా స్థానిక పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలని డీసీపీ సూచించారు.

## శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం





**తిరుమల జూలై 29 :** తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ఉదయం శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగారి చాతుర్మాస దీక్ష సంకల్పం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శ్రీ వైష్ణవ సంప్రదాయకర్త శ్రీ రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైంది. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని ప్రాశస్త్యం.కావున ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారు. చాతుర్మాస వ్రతం ప్రాచీనకాలం నుండి ఆచరణలో ఉన్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది.ముందుగా శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ,విష్వక్సేనా రాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.తరువాత సేకరించిన పుట్ట మన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం శ్రీ పెద్దజీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కనగల జీయ్యంగారి మఠం వద్ద నుండి శ్రీ చిన్నజీయంగారు మరియు ఇతర శిష్యబృందంతో బయల్దేరారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, శ్రీ వరాహస్వామివారిని దర్శించుకున్నారు. అక్కడినుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు.శ్రీవారి ఆలయ మహద్వారం చెంత టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర ఆలయ అధికారులతో కలిసి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీ జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత శ్రీ పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, శ్రీ చిన్నజీయంగారికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరించారు.అనంతరం శ్రీపెద్దజీయర్ మఠంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి కలిసి ఈవో,బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి,ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం,పేష్కార్ శ్రీ రామ కృష్ణ, నాసన్మానించారు.

## మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్



**ఆదోని జూలై 29 :** మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు.బుధవారం సాయంత్రం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మంత్రి నారా లోకేష్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కొద్దిసేపు వారితో మాట్లాడారు.

## నేడు వేములలో పంచాయతీ అభివృద్ధికి దిశానిర్దేశం

**మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి జీపిడీపీపై శిక్షణ**

**వేముల మండలం ఎంపీడీఓ శారదమ్మ ప్రకటన**



**వేముల జూలై 29 :**వేముల మండలంలోని గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపిడీపీ)పై నేడు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీఓ శారదమ్మ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అందులో భాగంగా ఆమె మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ కమిషనర్, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆదేశాల మేరకు వేముల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అనగా నేడు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన, పంచాయతీల పనితీరు మెరుగుదల, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు,జడ్పీటీసీ,ఎంపీటీసీ సభ్యులు,గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,మండల స్థాయి అధికారులు,డిజిటల్ సహాయకులు,ఇంజనీరింగ్ సహాయకులు,ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక స్వయం సహాయక సంఘం అనిమేటర్ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని అందరూ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో శారదమ్మ సూచించారు.శిక్షణకు హాజరయ్యే వారికి మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

## కల్తీ మాంసం విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తప్పవు: వేంపల్లె ఈఓ గాండ్ల కవిత

**వేంపల్లె జూలై 29:** వేంపల్లి లో వినియో గదారులకు కల్తీ మాంసం విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గ్రామ పంచాయతీ ఈవో గాండ్ల కవిత మాంసం విక్రయదారులకు హెచ్చ రించారు. స్థానిక తిరుమల థియేటర్ వద్ద ఉన్న మటన్ మార్కెట్ లో ఓ వ్యక్తి చనిపోయిన పొట్టేలు మాంసం విక్రయిస్తున్నారని స్థానికులు గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య ఆదేశాల మేరకు ఈవో కవిత తమ సిబ్బందిచే సదరు మటన్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. కిలో మాంసం రూ 850 కి విక్రయిస్తూ ప్రజలకు నాసిరకం మాంసం విక్రయించడం అన్యాయ మన్నారు. ఇకపై వినియోగదారులకు గొర్రెలను కానీ చనిపోయిన జీవాల మాంసం విక్రయిస్తే కేసులు తప్పవన్నారు. ఇకపై తరచూ దాడులు నిర్వహిస్తూనే ఉంటామని ఆమె పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది శివరామ్ ప్రసాద్, చాను, రాజుల పవన్ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



# గురు పూర్ణిమ వేడుకలు వైభవంగా

**- వేలాది భక్తులతో పలాస శివాజీనగర్ సాయిబాబా మందిరం కిటకిట**
**- మహా అన్నప్రసాద వితరణ, ప్రత్యేక పూజలు, భజనలు**
**- ఆలయ కమిటీకి భక్తుల హృదయపూర్వక కృతజ్ఞతలు**
**- శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా ఉత్సవాలు**





**పలాస డేట్ లైన్**
శ్రీకాకుళం జిల్లా పలాస శివాజీనగర్‌లోని ప్రసిద్ధ శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురు పూర్ణిమ మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. గురువారం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలి వచ్చి శ్రీ షిరిడి సాయిబాబా వారిని దర్శించుకుని తరించారు.
సూర్యోదయానికి ముందే ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గురు పూర్ణిమ సందర్భంగా సాయిబాబా వారికి 108 కలశాలతో అభిషేకం, పంచామృత అభిషేకం, చందన అలంకరణ చేశారు. భక్తులు స్వామివారికి పూలమాలలు, పండ్లు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా "సద్గురు సాయినాథ్ మహారాజ్ కి జై" అనే నినాదాలతో మారుమ్రోగింది.ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా భక్తుల రాకపోకలు కొనసాగాయి. వృద్ధులు, మహిళలు, చిన్నారులతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి, ధ్యానంలో కూర్చుని మానసిక ప్రశాంతత పొందారు. ఆలయంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమాలు భక్తులను మరింత ఉత్తేజపరిచాయి. సాయిబాబా భక్తులు భక్తి గీతాలు ఆలపించడంతో వాతావరణం ఆధ్యాత్మికతతో నిండిపోయింది.ఈ మహోత్సవంలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభమైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 20 వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. అన్నదానం కోసం ప్రత్యేకంగా పెద్ద పెద్ద పందిళ్లు ఏర్పాటు చేశారు. వందలాది మంది స్వచ్ఛంద సేవకులు వరుసల్లో నిలబడి భక్తులకు సేవలు అందించారు. పులిహోర, అన్నం, సాంబారు, రసం, అప్పడం, పాయసంతో కూడిన ప్రసాదాన్ని భక్తులు సంతృప్తిగా స్వీకరించారు. "అన్నదానం చేసిన వారికి సాయిబాబా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి" అనే బాబా వాక్యాన్ని స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ ఉత్సవాల ఏర్పాట్ల కోసం ఆలయ కమిటీ గత నెల రోజులుగా విస్తృత ఏర్పాట్లు చేసింది. భద్రతా దృష్ట్యా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. వైద్య శిబిరం, తాగునీటి సౌకర్యాలు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్వచ్ఛంద సేవకులు రాత్రింబవళ్లు కృషి చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల రోడ్లను శుభ్రం చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు.గురు పూర్ణిమ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. సర్వజన సుఖసంతోషాల కోసం, దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం వర్ధిల్లాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా వారి జీవిత బోధనలు – "సబ్కా మాలిక్ ఏక్", "శ్రద్ధ, సబూరి" అనే సందేశాలను భక్తులకు గుర్తు చేశారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరూ ఒక్కటిగా కలిసి ఉత్సవాల్లో పాల్గొనడం ఈ వేడుకల ప్రత్యేకతగా నిలిచింది.ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు, దాతలు ఆలయ అభివృద్ధికి విరాళాలు ప్రకటించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శి, సభ్యులు ఉత్సవాలను పర్యవేక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను కవర్ చేసిన మీడియా మిత్రులకు ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.ఉత్సవాలు ముగిసిన అనంతరం ఆలయ నిర్వాహకుడు దువ్వాడ శ్రీధర్ బాబా మాట్లాడుతూ, "గురు పూర్ణిమ మహోత్సవాన్ని ఇంత వైభవంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. వేలాది మంది భక్తులు వచ్చి ప్రసాదం స్వీకరించి ఈ ఉత్సవాన్ని విజయవంతం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, స్వచ్ఛంద సేవకులు, మీడియా మిత్రులు మరియు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరి సేవలను మరువలేము" అని అన్నారు. "శ్రీ షిరిడి సాయిబాబా వారి దివ్య అనుగ్రహం మీ అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు, శాంతి సమృద్ధిగా కలిగి ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను" అని ఆయన ఆకాంక్షించారు.స్థానిక భక్తులు మాట్లాడుతూ, పలాస శివాజీనగర్ సాయిబాబా మందిరం ఉత్తరాంధ్రలో ఒక ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఎదిగిందని చెప్పారు. ప్రతి గురువారం, పండుగల సమయంలో ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా గురు పూర్ణిమ రోజున జరిగే అన్నదానం, ప్రత్యేక పూజలు తమకు ఎంతో మానసిక తృప్తిని ఇస్తున్నాయని భక్తులు అన్నారు. "బాబా దర్శనం చేసుకున్న తర్వాత మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుంది. ఇక్కడి కమిటీ సేవలు అమోఘం" అని ఒక భక్తురాలు పేర్కొన్నారు.సాయంత్రం జరిగిన మహా మంగళహారతితో ఉత్సవాలు ముగిశాయి. హారతి అనంతరం భక్తులు బాబా పాదాలకు నమస్కరించి తమ తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లారు. పోలీసులు, స్వచ్ఛంద సేవకులు సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.మొత్తంగా పలాస శివాజీనగర్ శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో జరిగిన గురు పూర్ణిమ మహోత్సవం భక్తి, సేవ, సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. వేలాది మంది భక్తుల సమక్షంలో, అందరి సహకారంతో ఈ మహోత్సవం ఘనవిజయం సాధించింది.

## ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా సమగ్ర అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు జూలై 29 :**ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా సమగ్ర అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి నియోజకవర్గ ప్రత్యేక అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో స్వర్ణాంధ్ర ఏ 2047 లో భాగంగా వివిధ శాఖల స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జి.డి.డి.పి)పై సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు అమలు చేయనున్న కార్యాచరణ ప్రణాళిక (ఆక్షన్ ప్లాన్) పై జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక మరియు గణాంకాల డైరెక్టర్ బి.గోపాల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం యొక్క స్థానిక వనరులు, ప్రత్యేకతలు మరియు అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారులను ఆదేశించారు.వీటితో పాటు స్వల్పకాలిక ప్రయోజనకరమైన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. తక్కువ నీటితో వరి సాగు చేసే ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, వాటిని విస్తృతంగా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో నీటి కొరత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వరి సాగు కంటే ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు.
ముఖ్యంగా ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం తదితర ప్రాంతాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మామిడి, జామ, దానిమ్మ, సపోటా వంటి అధిక ఆదాయం అందించే వాణిజ్య పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.. పశువుల పెంపకానికి సంబంధించిన రుణాలను త్వరితగతిన ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రతి డివిజన్‌లో స్థానిక వనరులు, వ్యవసాయ అవకాశాలు, ప్రత్యేకతలను గుర్తించి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. విండ్ పవర్, సోలార్ పవర్ రంగాల్లో ఉన్న అవకాశాలను మరింత విస్తరించేందుకు కొత్త కంపెనీలను ఆకర్షించే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ తన పరిధిలోని అభివృద్ధి పనులపై స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేసి ప్రతిపాదనలు అందించాలని, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు శాఖలతో నిరంతరం సమన్వయం చేస్తూ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేయించాలన్నారు. పత్తి సాగు చేస్తున్న ప్రతి రైతు క్లస్టర్ బీన్ (గోరుచిక్కుడు), కంది, జొన్న, సజ్జ, బెండ వంటి పంటల్లో కనీసం రెండు పంటలను అంతర పంటలుగా సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించి 5 కోర్సు లను గుర్తించి వాటిని కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# మంత్రి నారా లోకేష్ పత్తికొండ పర్యటనపై సీపీఎం బహిరంగ లేఖ

**• సోలార్ భూ లీజు గడువు తగ్గించాలి.. • సాగునీరు రహదారుల సమస్యలు పరిష్కరించాలి**

**పత్తికొండ జూలై 29 :**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పత్తికొండ పర్యటన సందర్భంగా నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాల ని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ లేఖ విడుదల చేశారు. పత్తికొండ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.హోసూరు గ్రామంలో టాటా పవర్ సోలార్ ప్రాజెక్టు కోసం తీసుకున్న భూముల లీజు ఒప్పందాన్ని 30 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాలకు తగ్గించాలని, రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున లీజు చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే హంద్రీ కాలువకు హోసూరు సమీపంలో స్లూయిజ్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని కోరారు. హంద్రీనీవా కాలువల నుంచి పెద్దహుల్తి, చిన్నహుల్తి, జూటూరు, దూదేకొండ, కోతిరాళ్ల గ్రామాలకు పంట కాలువల ద్వారా సాగునీరు, తాగునీరు అందించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.టమోటా రైతుల ప్రయోజనాల కోసం నిర్మాణంలో ఉన్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని, పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలోని రోడ్లను విస్తరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే పత్తికొండ ప్రాంతం నిత్యం కరువుకు నిలయంగా ఉందని, ఇలాంటి ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి, ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి పర్యటనలు జరుగుతున్నప్పటికీ పత్తికొండ అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై స్పష్టమైన హామీలు రావడం లేదని విమర్శించారు.హోసూరు గ్రామంలో దాదాపు 1800 ఎకరాల్లో నిర్మిస్తున్న టాటా పవర్ సోలార్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ హాజరవుతున్న నేపథ్యంలో, ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్తున్నామని, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.ఎస్. రాధాకృష్ణ, మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు రంగారెడ్డి, వెంకటేశులు, గోపాల్, రామాంజనేయులు, సురేంద్ర, సిద్ధాగౌడ్, ప్రజాసంఘాల నాయకులు ఎం. రవిచంద్ర, ఉశేని, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com